# కథకుని (కి) పాట్లు

రచన:
శ్రీ జి. సోమేశ్వర రావు.

"దీపావళి కథల పోటీకి" అని, కవరుపై అడ్రస్ మీదుగా వ్రాసి, జాగ్రత్తగా చెమటంటకుండా హేండ్ కర్చీఫ్ చుట్టి సైకిల్‌పై పోస్టాపీస్‌కి బయల్దేరాను.

ఆ వీధిలో రేవునుండి నీళ్ళుతెచ్చుకొనే ఆడవాళ్ళు, బజారుకెళ్ళే మనుష్యులతో రోడ్డంతా గజిబిజిగావుంది. అప్పటికే సాయంత్రం కావస్తోంది. నేను అదుర్ధాగా రిజిష్టర్ పోష్టు టైం దాటిపోతుందే; మరునాడు ఆదివారమనే ధ్యాసతో శక్తిని పుంజుకొంటు సైకిల్ త్రొక్కుతున్నాను. ఒక బిక్షగాడు శరీరంపై చొక్కాలేదు. మొలకు చుట్టిన గావంచ కూడ చిరిగిపోయి మాసికలతో వుంది. తను రోడ్డుప్రక్కనే కడుతున్న భవంతి ముందు నిలువుగా కట్టివున్న దిష్టిబొమ్మకు తొడిగిన లాల్చీకి యొక్కడా చిరుగులేదు. అదే నాకుంటే యెంత బాగుణ్ణని వాడి మనసు, దృష్టి ఆ దిష్టిబొమ్మవంకే కేంద్రీకరించి అక్కడక్కడే తిరుగుతున్నాడు.

నేను సైకిల్‌పై వెళ్తూ ఆ బిక్షగాడ్ని తప్పించలేక, డొక్కు సైకిల్ బ్రేకులు పనిలేక వెళ్ళి గుద్దేసింది. నేను సైకిల్తో బోర్లాపడ్డాను. కవరు తూలిపోయింది. బిక్షగాడు ఒకవారగ కూలబడ్డాడు. నేను గబుక్కునలేచి, తగిలిన దెబ్బలు చూసుకోకుండా — కవరు తీసి, తుడిచి సైకిల్ హేండిల్ వంపు సరిచేసుకొని, చూసినవ్వేవాళ్ళనే చూసాయి నాకళ్ళు. చూడకుండా పోయినవారిని నామనసెంతో మెచ్చుకుంది.

చివరకు తొందరగా పోస్టాపీసుకి చేరుకున్నాను. రిజిష్టర్ చేయించే గుమస్తా కిటికీదగ్గరకెళ్ళి, కవరు అతనకందిస్తూ, "సార్! రిజిష్టర్డ్ పోష్టుకి స్టాంప్స్ ఎన్ని అంటించాలో వెయిట్ చూసి చెప్పండి?" అడిగాను.

గుమస్తా ఏదో వ్రాస్తూ విసుగ్గా, "టైం అయిపోయింది, రేపు తీసుకురండి!" అన్నాడు.

"రేపు ఆదివారం సార్!"

"అయితే సోమవారం తీసుకురండీ!"

"పోటీకి చేరే తేది దాటిపోతుందేమో! ప్లీజ్ యింకా క్లోజ్ చేయలేదు గాబోలు తీసుకోండి!"

"అబ్బ! వదిలేటట్టులేరే!" అంటూ, కవరందుకొని— చదివి— "మీరు కథలు వ్రాస్తుంటారా?"

"అవునండి!"

"దేంట్లోనైనా అచ్చయినాయా?"

"మూడు సంవత్సరాల క్రితం రెండు కథలు పడ్డాయి!" అని, గొప్పకోసం అబద్ధమాడేసాను.

"నాకూ సాహిత్యమంటే యింట్రస్టే! మీ స్ట్రీట్‌లోనే వుంటున్నాం యివ్వండి చదువుతాను!" అంటూ కవరు రెండు ప్రక్కలు పరీక్షగా చూశాడు.

అతడలా చూడంతో నాలో అదోరకమైన అనుమానం ప్రవేశించింది. యితడిలాగే క్రితం ఫ్రెండ్ ద్వారా రామారావు పరిచయమయ్యాడు. నేను వ్రాసిన కథను అతడి రైటింగ్ బాగుంటుందని ఫెయిర్ చేసిమ్మన్నాను. అలాగేనని తీసుకొని వ్రాసిచ్చేశాడు. ఆ కథను అశ్రద్ధ వల్ల నేను పంపలేకపోయాను. మరుచటినెల్లో ఫ్రెండ్ వీక్లీ తీసుకొచ్చి, "ఒరే మా బావ రామారావు వ్రాసిన కథ పడింది చూడరా!" అని, ఆ కథ చూపించాడు. యింకేముంది, ఆ కథ నేను వ్రాసిందే పేరు 'విరోధి విజయ' అక్షు అవరాలు— అవే పేరాలు— అదే పేరు కూడ యిది నేను వ్రాసిందే. కాని, రచయిత పేరు నాది కాదు. రామారావుది. జగిరింది మననున నెమరు వేస్తూ; కవరుపై స్టాంపు అంటించి గుమస్తా చేతికందించాను. వెంటనే రశీదు వ్రాసి, డేట్ స్టాంప్ వేసి నాకందించాడు కాని, కవరుపై నేను చూస్తుండగా

డేట్ స్టాంప్ వేయలేదు. అనుమానం తీరక "ఇంకా వుండమంటారా?" అడిగాను.

"మీరు కెళ్ళొచ్చు!" అన్నాడు.

కాళ్ళు వెళ్ళి పొమ్మంటున్నాయి. మనసు ఆ కవరుని యేం చేస్తాడో చూడు. యేమో, రామారావుకన్నా యితడేం గొప్పవాడుకాదు. పోనీ, తను రమ్మన్నట్లు సోమవారం వస్తానని వెళ్ళిపోయినా కాకుండేదేమో యిలా అడుగు ముందుకు మనసు వెనక్కు లాగుతున్నాయి. ఓపలేక వచ్చేయక తప్పిందికాదు.

ఆ క్షణంనుండి యేదృశ్యం చూసినా-ఎవరితో మాటాడినా-యేంపనిచేసినా, రామారావు చేసిన మోసం! పోస్టల్ గుమస్తా చేయబోయేది. ఆ గుమస్తాకూడ యీ వీధిలోనే వుంటున్నాడు కదా, అలాచేస్తాడా-ఏమో?

మీ...
మనోల్లాసమునకు




మెర్రి బనియన్లనే
ధరించండి.
ఏజెంట్లులేని ఊళ్ళలో ఏజెంట్లు కావలెను.
వివరాలకు :
MERRY KNITTING CO.
TIRUPUR-638604

అనే ఆలోచనలతో రాత్రి పక్కమీద నేను వాల్చేవరకు మెదడుకి మరో పనేంలేక సతమతమాతున్నాను.

మా యింటివద్దకొచ్చి, "మాతా-కాశీ అన్నపూర్ణేశ్వరీ మాదమాకవలం!" కేకలు పెడుతున్నాడు బిచ్చగాడు.

గోల భరించలేక తలుపులుతెరచి బయటకొచ్చి, "ఇంట్లో అందరూ పడుకన్నారు వెళ్ళవయ్యా-వెళ్ళు!" కోపంగా అన్నాను. కాని, నా సైకిల్ గుద్దిన బిచ్చగాడితడేనని తప్పుకొని గుమస్తా యింటివంక చూశాను.

అలా పదిళ్ళు దాటింతరువాత గుమస్తావున్న ఇంటి యొక్క వీధి కిటికీనుండి వెలుగు రోడ్డుపై అడుగాపడుతోంది. ఆ వెలుగులోకి బిచ్చగాడుచేరుకొని "మాతా-కాశీ అన్నపూర్ణేశ్వరీ..." అంటున్నాడు.

పోస్టుగుమస్తా ఆ కవరు ఇంటికితెచ్చి, యేదోచేస్తున్నాడనే అనుమానంతో నేను వాళ్ళింటికి దగ్గరగా వెళ్ళాను.

కిటికీకి కుడి ప్రక్కగా నున్న టేబుల్ వద్ద పోస్టు గుమస్తా యేదో వ్రాసుకుంటున్నాడు. యీ బిచ్చగాడి గోల డిస్టర్బ్ కావడంచేత-"విజయా... ఓ విజయా...!" అంటు భార్యను పిల్చాడు.

"అబ్బబ్బ! యేవిటండీ-బాబుకి పాలిస్తున్నాను వుండండి వస్తాను!" అంది.

"వీధిలో బిచ్చగాడు అరుస్తున్నాడు. యేదో చెప్పి పంపించు!"

"అలాగే, చేస్తానుండండి!"

తర్వాత వీధిగుమ్మంనుండి స్త్రీ రావటం, యేదో చెప్పగా బిచ్చగాడు కదలడం చూసాను. ఆ ప్రక్కనే కడుతున్న భవంతిముందు దిష్టిబొమ్మను బిచ్చగాడు చూసి సాయంత్రంలాగే చూస్తూ నిల్చుండిపోయాడు.

"గుమస్తా వ్రాసేది నాకథేమో-అవునో-కాదో తెల్సుకోవాలనుంది. యెలా?", నెమ్మదిగా ధైర్యం తెచ్చుకొని అడుగులో అడుగు మెత్తగావేస్తూ మెట్లెక్కి, వరండాపైకి దొంగాడిలా చేరుకున్నాను.

ప్రక్క బిచ్చగాడు దిష్టిబొమ్మవంక చూస్తూ, "అమ్మో! ఆ దిష్టి బొమ్మకున్న అదృష్టం నాకులేదా?" అనుకుంటూ రోడ్డులో ఎవరూ నడవటంలేదు యింతకు మించిన సమయంలేదని దిష్టిబొమ్మకు దగ్గరగా వెళ్ళి, ఆ లాల్చీని యెలా తీసుకోవాలా? అని, ఆలోచిస్తున్నాడు గాబోలు.

గుమస్తా యింటి వరండాపైనా అవస్థ భగవంతునికి తెలియాలి, అంత చలిలోను శరీరమంతా చెమట చిమ్మినట్లు భ్రమించాను. గుండె దడదడలాడుతోంది. గోడ గడియారం టంగ్... టంగ్ మని పదకొండు గంటలు కొట్టింది. నా శ్వాస ప్రాణాలకి గాలంముల్లు గ్రుచ్చుకున్నట్లయింది.

"యేమండీ! యివేళ పదకొండు దాటినా వ్రాస్తున్నారు - అక్కడితో ఆపి, వచ్చి పడుకోండి!" అంది విజయ.

"అబ్బబ్బ! వుండవే నీ గొడవనీది. యిది వేగరం పూర్తి చేస్తే భగవంతుడు చల్లగా చూస్తే మనజీవితాలు చక్కబడతాయ్!" అన్నాడు గుమస్తా.

నా అనుమానం: 'అది వాడే అయ్యుంటుంది. ఫెయిర్ చేసి, అతడి పేరున పంపిస్తే ప్రథమ బహుమతి రూ॥ 2,500/-లు యీ గుమస్తాగాడే కొట్టేద్దామనుకుంటున్నాడు' కిటికీకి ప్రక్కగా వెళ్ళాను. అతని కుడి ప్రక్కగా వెళ్ళాను. అతడు కుడి ప్రక్కగా నున్నందువలన గాబోలు కనిపించలేదు. నిల్చొంటే కిటికీ వెలుగులో నా క్రీనీడ పొడవుగా పడుతుంది. అటు ప్రక్కగా వెళ్ళటమెలా? అని, గొంతుగ్గా కూర్చోబోయాను. చొక్కా జేబులోనుంచి అర్ధరూపాయి చిల్లర గచ్చుపై పడి కణ్...కణ్...మని శబ్దంచేస్తూ దొర్లిపోయింది. పట్టుకుందామని చేయిచాపాను. అందకుండానే క్రిందికిపోయింది.



వ్రాస్తున్న గుమస్తా ఆగిపోయి, టేబుల్ చుట్టూ నేల వైపు చూసాడు. తనకేం కనిపించలేదు. "సర్లే క్రిందివి పడితే ఎక్కడికి పోతుందనుకొని, విజయ! నేలపై చిల్లర డబ్బులేవో పడినట్టున్నాయి. నువ్వు వుదయం తుడిచేటప్పుడు తీసి, జాగ్రత్త చేయి!" అంటూ వ్రాతలో నిమఘ్నమయ్యాడు.

నిద్రమత్తుతో "ఊ..." అంది.

నేను నెమ్మదిగా దేవరుకుంటూ పోయి, కిటికీకి అటు ప్రక్కగా శబ్దం కాకుండా నిల్చున్నాను. గుమస్తా ముందు తెరచివున్న ఫైల్లో తెల్లకాగితాలున్నాయి. వాటిపై ముత్యాల్లాంటి అక్షరాలు రైలు పట్టాల్లా వంపు లేకుండా తిన్నగావుంది వ్రాత. ప్రక్కనే యేదో కదలుంది. అంతలోనె నాముక్కు దురదపుట్టి ఆపుకోలేక తుసుక్కున తుమ్మేసాను.

గుమాస్తా తృళ్ళిపడి "ఎవరది? విజయా ఓ... విజయా! నిన్నే లేచి రమ్మంటే?" గట్టిగా పిల్చాడు భయంతో.

నా కాళ్ళు చేతులు వణకి పోతున్నాయి గుండె దడదడలాడుతుంది. యేం చేయాలో తోచటం లేదు అలా కొయ్యాబారి పోయాను.

"అబ్బబ్బ, వస్తున్నానుండండి! మీరు రామకోటి వ్రాస్తున్నారో లేదోగాని, "వెనకటికి ఒక కమ్మరి పోలి తక్కువని గుడ్డిదాన్ని పెల్లాడితే నెలకు మూడు ఆవలు కుండలు చిదగ్గొట్టేదట!" అంటూ గదిలోకొచ్చి, "యేవండీ! కిటికీ బయట నీడలా వుందేవిటి? చూస్తానుండండి" అని, ఆశ్చర్యంగా వెనుతిరిగింది.

వెంటనే నేను భయంతో వరండాదిగి, పరుగు లంఘించాను.

యింతలో ప్రక్కనే దిష్టిబొమ్మకున్న లాల్చీని బిక్షగాడు తీసి, తొడుక్కొని, నన్ను చూసి తనను పట్టుకొనేందుకొస్తున్నాననే భయంతో బిక్షగాడు పరుగెడుతున్నాడు. నేను వెనుతిరిగి చూస్తూ పరుగెడుతూ ముందున్న బిక్షగాడ్ని గుద్దేసరికి, వాడి చేతిలోనున్న అన్నంచిప్పతూలి, దండుకున్న అన్నమంతా మట్టిలో కలిసిపోయింది. నేను మాత్రం పరుగు ఆపలేదు. ఆమె వరండాలో కొచ్చేసరికి నేను వీధి మలుపు తిరిగి మెయిన్ రోడ్డుకు చేరుకొని చూస్తే, బిక్షగాడు మాత్రం నిల్చొని మట్టిలో కల్సిన అన్నంవంక తను దొంగిలించి తొడుక్కున్న లాల్చీవంక చూసి, చలిబాధ తగ్గినా, ఆకలి బాధ మిగిలిపోయింది పాపం! నేను పడ్డపాట్లుకి...

★★
★

చక్కని అల్లిక - చిరకాల మన్నిక.




వీనస్ నిట్టింగ్ కంపెనీ,
తిరుపూరు-638604